# హింసధ్వని

ఈమధ్య హింస బాగా ఎక్కువైపోయింది. సినిమాలు చూడండి, సాహిత్యం చదవండి .... హింస ....హింస ! కొట్టుకోటాలు , నరుక్కోటాలూ ఎన్ని హత్యలుంటే అంతగొప్ప సినిమా అనే ధోరణికి బాగా అలవాటయిపోయింది. ఆడవాళ్ళే తిరగబడి మొగుళ్ళని, విలన్స్‌ని నడి వీధుల్లో నరికి పారెయ్యటం గూడా సినిమాల్లో మనం చూస్తున్నాం. ఇలా సినిమాలు తీస్తే పరిణామాలు ఎలా వుంటాయో తెలుసుకోవాలంటే రోజూ పేపరు ఫాలో అయితే చాలు. హోటల్లో కాఫీ ఇవ్వటం ఆలస్యం అయిందని నలుగురు కుర్రాళ్ళు సప్లయిర్ని పొడిచి పారిపోయేరట. అలాగే ప్రేమించిన పిల్ల పలకలేదని పరీక్షహాల్లో పెట్రోలు పోసి తగలేసాట్ట ప్రేమికుడు.ఆస్థి ఇవ్వనన్నాడని కన్న తండ్రిని గొడ్డలితో నరికాట్ట తనయుడు. ఇవన్నీ పేపర్లో వచ్చిన వార్తలే.

ఇప్పుడొస్తున్న సాహిత్యం పరిస్థితీ ఇలాగేవుంది. అల్పజీవి సగటు మనిషి, పేక మేడలు కూలిన గోడలు, లాంటి టైటిల్సు పోయి, పోరాటాలు , ఆరాటాలు , మృదంగాలు ముదనష్టాలు ఎక్కువైపోయినాయి. పాశ్చాత్య ప్రభావం ఎక్కువైపోయింది. ఈ పుస్తకాలు చదివి, ఈ సినిమాలు చూసాక హింస పెరగగ తగ్గుతుందనుకోవటం అవివేకం. కొన్ని కొన్ని పేటల్లో రాత్రిళ్ళు ఎవరొచ్చి తలుపు తట్టినా తెరవకూడదని వాళ్ళు ఈ నిర్ణయానికొచ్చేరట. బయటికెడితే తిరిగొచ్చేదాకా నమ్మకం లేదు. ఏ రిక్షా వాడు కత్తి చూపిస్తాడో, ఏ ఆటో డ్రయివరు హేండ్సప్ అంటాడో తెలీదు. మనుషుల్లో హింస ప్రవృత్తి రోజు రోజుకీ పెరిగిపోతుంది. అన్ని సమస్యలకీ జవాబు హింసేనన్న ధోరణి బాగా ప్రబలిపోతుంది. దీనికి తోడు పేపర్లో వార్తలకి వాడుతున్న మకుటాలు వీటికేం తీసిపోయేటట్టుగా ఏం లేవు. “ కాదంటే ఖతం చేస్తాం ” పనివ్వకపోతే పని పడతాం ? నీళ్ళివ్వకపోతే నిప్పులు కక్కుతాం లాంటి హెడ్డింగులతో జనాన్ని రెచ్చగొట్టి తమవంతు కర్తవ్యాన్ని తాము పూర్తి చేస్తున్నారు.

హింసకి తోడు ధ్వని కూడా పెరిగింది. ప్రశాంతంగా, నిశ్శబ్దంగా కొద్ది క్షణాలు గడపటానికి అనువైన స్థలంకోసం మనిషి వెళ్ళే పరిస్థితి ఏర్పడుతోంది. ఈ మధ్యన

కూతురింటికి చట్టం చూపుగా వచ్చిన ఒకాయన పక్క వేపున్న హాల్లో సినిమా చూట్టానికనివెళ్ళేట్ట. తీరా వెళ్ళిన పావుగంటలో మొహం కందగడ్డలాగా పెట్టుకు తిరిగొచ్చేట్ట. ఏవైందని అడిగితే కారణం చెప్పకుండా ‘ పాపిష్టి సినిమాలూ మీరూను. అది సంగీతమా ! వెయ్యి పులుసు కళాయిల్ని గరిటెలతో కొట్టినట్టు అంటూ ఆ శబ్దాన్ని భరించలేక తల్లి గర్భంలోంచి బయటపడ్డాట్ట. ఇప్పుడొస్తున్న సంగీతానికి భాస్యానికి సంబంధం లేదు. మొటికలు విరిచిన శబ్దం, చప్పరింపులు, ముక్కటాలు, మూలగటాలు సంగీతం పేర్న చలామణి అయిపోతున్నాయి. కాలేజీ కుర్రాళ్ళని రెచ్చగొట్టే విధాన సంగీతమూ , బాణీలు తయారవుతున్నాయి. దేవులపల్లి సాహిత్యం, ఘంటసాల, రాజేశ్వర్రావు సంగీతం మనకు తియ్యటి జ్ఞాపకంలాగా, తల్చుకుని పోల్చుకుని బాధపడటానికే తప్ప అటువంటి మధురమైన సంగీతం మళ్ళీరాదు. ఈ మధ్యన ఇప్పుడొస్తున్న బాణీతో పాటలూ పద్యాలూ పాడుతున్న ఓ జీన్స్ గాయకుడ్ని ఎవరో అడిగేరట. ‘ పాటకి ఎంత తీసుకుంటారని ? ’ అందుకాయన ఏ మాత్రం తడుముకోకుండా పాడినందుకా, ఆపినందుకా ” అనడిగాట్ట. అంతకమ్మగా వుంటోంది మన సినిమా సంగీతం.

అహింసని ఆయుధంగా జీవితాంతం పోరాడగా మహాత్ముడు పుట్టిన ఈ దేశంలో హింస, ధ్వని కాలుష్యం ఇంతలా పెరిగిపోవటం, పుణ్యనదుల ప్రవాహంతో పవిత్రమైన ఈ నేల మానవ రక్తంతో ఎర్రబారటం మనం నవ్వుకోదగ్గ విషయాలు కావు – అంచేత ప్లీజ్ డోంట్ స్మైల్ !

------- అయ్యిపోయింది -------